క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



పాలకుర్తి టౌన్: భారత నాస్తిక సమాజం మూడో మహాసభల కరపత్రాలను శనివారం పాలకుర్తిలో చిట్యాల ఐలమ్మ స్మారక విగ్రహం వద్ద నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ జీవై సోమయ్య మాట్లాడుతూ ప్రజలు మూఢ నమ్మకాలను విడనాడాలన్నారు. హనుమకొండలోని పీఆర్ రెడ్డి భవన్‌లో ఈ నెల 24వ తేదీన నిర్వహించే మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడిరాజు సాంబయ్య, ప్రశాంత్, రవి వర్మ, కాకర్ల కృష్ణ, యాకయ్య, చిట్యాల కొండయ్య, శంకర్, ఎల్లయ్య, సోమయ్య, రాజు, సోమచందర్, బొట్ల శ్రీధర్ పాల్గొన్నారు.

అమీర్ అలీఖాన్‌కు సన్మానం



జనగామ: జిల్లా కేంద్రానికి శనివారం వచ్చిన ప్రముఖ ఉర్దూ పత్రిక సియాసత్ ఎడిటర్ అమీర్ అలీఖాన్‌ను టీపీసీసీ సభ్యుడు, డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ ఘనంగా సన్మానించారు. ఆయన వెంట జీవీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు లకావత్ కిరణ్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాజేందర్ నాయక్, జమాల్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

అనాథ పిల్లల మధ్య పుట్టినరోజు వేడుకలు



జఫర్‌గఢ్: మండలంలోని టీబీతండా వద్ద ఉన్న మా ఇల్లు ప్రజాదరణ అనాథ ఆశ్రమంలోని అనాథ పిల్లల నడుమ ఎస్‌ఆర్‌ఐ విద్యార్థి సాయిచరణ్ పుట్టిన రోజును కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మామిడాల వెంకటేశ్వర్లు–కావ్య దంపతుల కుమారుడు సాయిచరణ్ అమెరికాలో ఉద్యోగం చేస్తుండడంతో అతని పుట్టిన రోజును ఆశ్రమంలో నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలు సాయిచరణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకురాలు గాదె పుష్పతో పాటు సాయిచరణ్ కుటుంబ సభ్యులు, అనాథ పిల్లలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు దూడ మృతి



మృతి చెందిన దూడ వద్ద బాధిత రైతు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలో దాసరి రాజుకు చెందిన ఆవు దూడ విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తాటికొండ గ్రామానికి చెందిన రాజు అదే గ్రామానికి చెందిన బేతి రాజారెడ్డికి జీతం ఉన్నాడు. రోజూ మాదిరిగానే వ్యవసాయ క్షేత్రంలో రాజుకు చెందిన దూడ మేత మేస్తుంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ తగలగడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. దూడ విలువ దాదాపు రూ.40వేలు విలువ ఉంటుందని, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరైన రక్షణ కంచె ఏర్పాటు లేకపోవడం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. కాగా, ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారులు స్పందించాలని, పేద కుటుంబానికి చెందిన రైతు రాజును ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

లింగాలఘణపురం: నెల్లుట్ల బైపాస్ వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలానికి చెందిన వాంకుడోత్ మోహన్, వాలు మినీ గూడ్స్ వాహనంలో 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనంచేసుకున్నట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. వాహనంతో పాటు ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కొడకండ్ల: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల/దేవరుప్పుల: సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు భరోసా లభిస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను తొర్రూరు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణ పట్ల నిర్లక్ష్యవైఖరి ప్రదర్శించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా అమలు చేసిందని తెలిపారు. త్వరలో అర్హులైన వారందరికి ఆరోగ్య బీమా కార్డులను జారీ చేసి ప్రభుత్వం అండజేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కొడకండ్ల, దేవరుప్పుల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు ధరావత్ సురేష్‌నాయక్, నల్ల శ్రీరాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్, రవిందర్, యాకేష్‌యాదవ్, అంజయ్య, రంగయ్య, అయిలయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పీరీల సందడి



స్టేషన్‌ఘన్‌పూర్: పీరీలను ఊరేగిస్తున్న భక్తులు



బచ్చన్నపేటలో..

స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట: మొహర్రం పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పీరీల ఊరేగింపు నిర్వహిస్తున్నారు. పీరీలను ఎత్తుకుని కులాలు, మతాలకు అతీతంగా హిందువులు, ముస్లింలు దూలాహ్ అంటూ అల్లా దేవుడిని ప్రార్థిస్తూ గ్రామాల్లో ఇంటింటా తిరుగుతున్నారు. ప్రజలు పీరీలు ఎత్తుకున్న వారికి కాళ్లకు నీరు పోస్తూ కానుకలు సమర్పిస్తుండగా పీరీలతో ప్రజలను వారు ఆశీర్వదిస్తున్నారు. పీరీల ఊరేగింపుతో గ్రామాల్లో సందడి నెలకొంది.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

పాలకుర్తి: విద్యార్థులు సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై లింగారెడ్డి అన్నారు. మండలంలోని గూడూరులో గిరిజన విద్యార్థినులకు సైబర్ నేరాలపై శనివారం పోలీసులు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు సెల్ ఫోన్ వల్ల కలిగే నష్టాలను వివరించాలన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి, రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యాలయం ఆవరణలో ఎస్సై, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు మొక్కలు నాటారు.

వడ్డెర సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



వెంకటమల్లు



కిష్టయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామ వడ్డెర సంఘం నూతన కమిటీని శనివారం కుల పెద్దమనుష్యుల సమక్షంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శివరాత్రి వెంకటమల్లు, ఉపాధ్యక్షుడిగా శివరాత్రి కిష్టయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డెర సంఘం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందని, సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెరలు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో చైతన్యం చెందాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలన్నారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెర విద్యార్థులకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ పథకాల్లో సముచిత స్థానం కల్పించాలని తదితర న్యాయమైన హక్కుల సాధనకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు.

అనుమతులు ఇప్పించండి



ఎమ్మెల్యే శ్రీహరితో కృష్ణాజీగూడెం నాయకులు

చిల్పూరు: కేటాయించిన స్థలంలోనే మహిళా సంఘం భవనం నిర్మించుకునేలా అనుమతులు ఇప్పించాలని మండలంలోని కృష్ణాజీగూడె గ్రామానికి చెందిన మహిళలు, వివిధ పార్టీల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం హనుమకొండలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మహిళా సంఘానికి స్థలం అప్పగించాలని అధికారులకు ఆదేశించారని తెలిపారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యేకు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఏలు రజిత, మాధవి, శ్రావణి, శైలజ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రాజేందర్, భీమయ్య, మల్లేషం, రఘు, రాజశేఖర్‌రెడ్డి, సీపీఎం కార్యదర్శి శ్రీనివాస్, సాదం రాజేశ్వరి, రేణుక, లలిత, రాణి, సరిత, కవిత పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్ పంపిణీ



పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కొడకండ్ల: కొడకండ్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దామెర రవిందర్, గాజుల రాములు, కోశాధికారి నేతి కొండయ్య, ఉపాధ్యక్షుడు దోర్నం ప్రభాకర్, రాము, మధుసూధన్, కోటి, ప్రభాకర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

చిల్పూరు : మండలంలోని కృష్ణాజీగూడెం ఆరోగ్య ఉపకేంద్రం సమీపంలోని మినీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగు నెలలు గడిచిన కొత్తది ఏర్పాటు చేయడంలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి దాదాపు 200 ఇళ్లకు కరెంట్ సరఫరా అవుతుంది. దీంతో సాయంత్రం పూట చీకటిగా ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు చెప్పిన మారుస్తామంటున్నారే తప్ప పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి చేరాలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంతలు



ప్రమాదకరంగా మారిన గుంత

బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేట, నారాయణపురం గ్రామాల మధ్యన ఉన్న బీటీ రోడ్డు పక్కన గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. చిరుజల్లులకే ఇలా గుంతలు ఏర్పడితే భారీ వర్షాలు కురుస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పోచన్నపేట నుంచి బీటీ రోడ్డు మీదుగా నారాయణపురం, బొందుగుల, రాజపేట, యాదాద్రి తదితర ప్రాంతాలకు నిత్యం వాహనాలు వెళ్తుంటాయి. అధికారులు స్పందించి ప్రమాదకర గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పరిశుభ్రత పాటించాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జీపీ సిబ్బంది అంకితభావంతో రోజూ 8 గంటలు విధులు నిర్వర్తించాలని అన్నారు. గ్రామస్తులు తడి పొడి చెత్తను వేరు చేసి ఇంటి ముందుకు వచ్చే జీపీ ట్రాక్టర్‌లో వేయాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరిస్తాం..



బచ్చన్నపేట : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్లు, సఫాయి, ఎలక్ట్రీషియన్, వాటర్‌మన్ తదితర సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క సిద్ధంగా ఉన్నట్లు జీపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహులు, కార్యదర్శి శ్రీనివాస్‌చారి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. జీఓ 51తో జీపీ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని, జీఓ 60 ప్రకారం నెలకు రూ.19, 500 జీతం అందించాలని పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

ఆర్థికసాయం

చిల్పూరు: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మోతె రాజు ఇటీవల ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పుట్ట రాజు రూ. 2వేల సాయం అందజేశారు. గాలి రాజు, కనుకయ్య, పులికాశి రాజయ్య, చంద్రమౌళి, సంపత్, కుమార్, వేణు, రాములు, కిష్టయ్య తదితరుల ఉన్నారు.

వీధి కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన బాలుడు కనుకటి వేదాంత్‌పై శనివారం వీధికుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన కనుకటి రాము కుమారుడు వేదాంత్ ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేయడంతో గాయాలపాలయ్యాడు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని బీజేపీ నాయకుడు గుంజె రఘుపతి కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న రాజశేఖర్

నర్మెట: మండలంలోని కాకతీయుల కాలంనాటి అతి పురాతన శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కాగా, నిర్మాణ కమిటీ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పునర్నిర్మాణం పనులు చేపట్టారు. ఈక్రమంలో పనులు యుద్ధప్రాతిపదికన సాగుతుండగా దాతలు పలువురు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా రైతు బందెల రాజశేఖర్ తనవంతుగా రూ. 5 వేలు శనివారం కమిటీ అధ్యక్షుడికి అందజేశారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణంలో సహకరించాలని కమిటీ కోరింది. కార్యక్రమంలో ప్రజ్ఞాపురం శ్రీధర్, కొండ బాలయ్య, దేవులపల్లి భాగ్యలక్ష్మి, యాదగిరి, నర్సిరెడ్డి, బనుక అంజయ్య, సంగి మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్లో డే



చిల్పూరు: పిల్లలకు పసుపు రంగుపై అవగాహన కల్పిస్తున్న టీచర్లు



జనగామ: ఎల్లో డ్రెస్‌లో చిన్నారులు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరు, చిల్పూరుగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీల కేంద్రాల్లో ఎల్లో డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ దూలమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం అంగన్‌వాడీల్లో ప్రతీవారం ఒక్కో రంగుపై చిన్నారులకు అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా పసుపు రంగు బెలూన్లతో పిల్లలకు ఆటలు ఆడించామన్నారు. ఆయా స్వరూప, మాధవి, బాలమణి పాల్గొన్నారు.

మృదుల కిడ్స్‌లో..

జనగామ: పట్టణంలోని బాలాజీనగర్ మృదుల కిడ్స్‌లో శనివారం ఎల్లో డే నిర్వహించారు. చిన్నారులు ఎల్లో డెర్స్ ధరించి మహరాజా టోపీలతో వేడుకలను జరుపుకున్నారు. పిల్లలకు కలర్స్ ప్రాముఖ్యత తెలియజేసేందుకు వేడుక నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.

'జంగా'ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



జంగా రాఘవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మనోహర్ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని ఘన్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గట్టు మనోహర్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శనివారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జంగాకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రశాంత్, కౌశిక్, శ్రీధర్ తదితరులున్నారు. అలాగే కాంగ్రెస్ గిరిజన నాయకులు ఆయను కలిసి సన్మానించారు. పొట్టి గుట్ట, చిప్పరాళ్లబండ, పడమటి తండా కాంగ్రెస్ పార్టీ గ్రామాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

నీరు నిల్వకుండా ఏర్పాట్లు చేస్తాం..



స్థానికులతో మాట్లాడుతున్న విమల

చిల్పూరు: చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ అంగడి ఆవరణలో వర్షపు నీరు నిల్వకుండా ఏర్పాట్లు చేస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విమల తెలిపారు. చిరుజల్లులకే అంగడి ఆవరణలో నీరు నిలిచి అపరిశుభ్రంగా మారుతోందన్న స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించి ఇన్‌చార్జ్ తహసీల్దార్ విమలతో సమస్యను తెలుసుకోవాలని ఆదేశించారు. దీంతో ఆమె శనివారం అంగడి ఆవరణకు వెళ్లి స్థానికుల నుంచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు నిలుస్తోందని, డబుల్‌రోడ్డు నిర్మించే వరకు వర్షపు నీరు నిల్వకుండా చూస్తామని చెప్పారు. ఆలయ మాజీ చైర్మన్ మూల నాగరాజు, పంతం రాజు, నారగోని రవి, జిల్లా రాజు, కల్లూరి శరత్, బాల్నె శోభ, పాము లక్ష్మి, మూల శోభారాణి, తాటి సుమతి, బాల్నె ప్రవళిక, మాచర్ల కోమళ, తాటి బాగ్యలక్ష్మి, నారగోని గీత, కల్లూరి లక్ష్మి తదితరులు ఉన్నారు.

నియామకం



పరమేశ్వర్‌గౌడ్

చిల్పూరు: సామాజిక న్యాయ వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన నారగోని పరమేశ్వర్‌గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు యెశబోయిన సాంబయ్య యాదవ్ శనివారం తెలిపారు. సామాజిక ఉద్యమాల్లో, గౌడ సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ 'మేమెంత మందిమో మాకంత వాటా' అంటూ గౌడ సంఘం తరపు న్యాయ పోరాటం చేసిన పరమేశ్వర్‌ను గుర్తించి నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేలా కృషి చేసిన సాదం గట్టయ్య యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న వంశీధర్‌రెడ్డి



సోమశేఖర్‌ను పరామర్శిస్తున్న శ్రీకాంత్

లింగాలఘణపురం: మండలంలోని వనపర్తిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన కుక్కల మల్లేశం, వడిచర్లలో అనారోగ్యంతో మృతి చెందిన కూటిగంటి యాదగిరి మృతదేహాలకు శనివారం మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుడు కారంపురి చంద్రయ్య తల్లి నర్సమ్మ అనారోగ్యంతో ఇటీవల చనిపోవడంతో ఆ కుటుంబాన్నీ పరామర్శించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్, నాయకులు నాగేందర్, మాజీ సర్పంచ్‌లు శ్రీధర్, గణపతి, కృష్ణ, ఉపేందర్‌రెడ్డి, రాజా రవీందర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ నాయకుడు నర్ర సోమశేఖర్ తండ్రి కొండయ్య మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి ఆర్థిక సాయం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, గ్రంథాలయ జిల్లా మాజీ డైరెక్టర్ కారుపోతుల బిక్షపతి, తీగల సత్తయ్య, బొజ్జం యాకయ్య, బొందుగుల యాదగిరి, నర్ర సోమసుందర్ ఉన్నారు.

సంతాపం



అమరావతి(ఫైల్)

యాదాద్రి జిల్లా గుండాల మండలం తాజా మాజీ ఎంపీపీ తాండ్ర అమరావతి (27) గుండెపోటుతో శనివారం దుర్మరణం పొందడం పట్ల బీఆర్‌ఎస్ మండల కమిటీ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. దేవరుప్పుల మండలం మాధాపురానికి చెందిన బెజుగం రాములు కూతురు అమరావతిని ఆరేళ్ల కిందట గుండాల మండలం మరిపడిగెకు చెందిన తాండ్ర శోభన్‌కు ఇచ్చి వివాహం చేశారు. గత మండల పరిషత్ ఎన్నికల్లో మరిపడిగె ఎంపీటీసి(బీఆర్‌ఎస్)గా గెలిచిన తాండ్ర అమరావతి గుండాల మండల పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నికై ఇటీవల పదవీ కాలం ముగిసింది విదితమే. ఇలాంటి తరుణంలో ఆమె అకాల మృతి చెందడంతో మాధాపురంతోపాటు పలు గ్రామాల్లోని బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. అమరావతి మృతిపట్ల మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి, కత్తుల విజయ్, మాధాపురం మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

● ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టడంతో అవి రెండు బోల్తా పడ్డాయి. దీంతో వాహనాలు దెబ్బతినగా ట్రాక్టర్ డ్రైవర్ షరీఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నపెండ్యాల నుంచి స్టేషన్‌ఘన్‌పూర్ వైపునకు వెళ్తున్న ట్రాక్టర్ వెనకాలే హైదరాబాద్‌కు వెళ్లే కారు వేగంగా వస్తోంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ యూటర్న్ తీసుకుంటుండగా కారు వేగంగా ఢీకొనడంతో ట్రాక్టర్, కారు బోల్తా పడ్డాయి. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ట్రాక్టర్ డ్రైవర్ షరీఫ్ గాయపడ్డాడు. కాగా రెండు వాహనాలు రోడ్డుకు అడ్డంగా పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలియగానే ఎస్సై ముత్యం రాజేందర్, కానిస్టేబుల్ చారి అక్కడికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.